క్లుప్తంగా

కరకట్టపై వాహనాల తనిఖీ



తోట్లవల్లూరు: కృష్ణా కరకట్టపై పోలీసులు బుధవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. విజయవాడ-అవనిగడ్డ మధ్య కృష్ణా కరకట్టపై రాకపోకలు సాగించే వాహనాలను తోట్లవల్లూరు వద్ద ఎస్ఐ జి.రమేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. విద్యుత్ ఉద్యోగులు చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తు చర్యలలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. పమిడిముక్కల సీఐ చలపతిరావు తనిఖీలను పర్యవేక్షించారు.

బీమా రంగంలో ఉజ్వల భవిష్యత్తు



గుడివాడ టౌన్: దేశం అవలంభిస్తున్న సరళీకృత ఆర్థిక విధానం వలన బీమారంగంలో యువతకు మంచి భవిష్యత్ ఉంటుందని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ కె.శ్రీనాథ్ అన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో బుధవారం ఎంబీఏ విద్యార్థులకు ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగ అవకాశాలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బీమారంగంలో ఎన్నో రకాల పథకాలు, పాలసీలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు వీటిపై అవగాహన పెంచుకుని స్వయం ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఎంబీఏ విభాగాధిపతి ఎస్.లక్ష్మీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: చదరంగం పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి 4 పతకాలు సాధించినట్లు డాక్టర్ కేకేఆర్ గౌతమ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యారామ్ తెలిపారు. బుధవారం పాఠశాలలో పతకాలు సాధించిన చిన్నారులను అభినం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ ఎన్టీఆర్ స్టేడియం నిర్వహించిన స్కూల్ లెవల్ చదరంగం పోటీల్లో తమ విద్యార్థులు ఓపెన్ టాప్ 10 విభాగంలో పి.చిన్నయి సాయిదత్త 4వ స్థానం, టి.శ్రీతేజ 7వ స్థానం, పి.నీరజ్ కుమార్ 8వ స్థానం దక్కించుకోగా అండర్ 13 విభాగంలో ఎ.కార్తీక్ ప్రథమ స్థానం, అండర్ 7 విభాగంలో ఎం. దియాన్ తృతీయ స్థానం, అండర్ 15 విభాగంలో పి.గౌతమ్ ఈశ్వర్ తృతీయస్థానం సాధించినట్లు తెలిపారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, కోచ్ స్వర్ణలతను అభినందించారు. ప్రిన్సిపాల్స్ లక్ష్మీ ప్రసాద్, జ్యోతి, జబ్రీనా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు క్రైస్తవ సంఘ నేతల సన్మానం



పామర్రు: నూజివీడు, పామర్రు నియోజకవర్గాల క్రైస్తవ సంక్షేమ సంఘ నాయకులు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూ అన్ని వర్గాల అభ్యున్నతికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అమలు చేస్తున్న తీరు ప్రశంసనీయమని అన్నారు. క్రైస్తవ సంఘాల సంక్షేమానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్‌ను శాలువాలతో పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. నూజివీడు సంక్షేమ సంఘ అధ్యక్షుడు కలపాల ప్రభాకర్, పామర్రు సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, ఇందిరారాణి, పద్మలత, చందు తదితరులు ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో ఉన్నారు.

అబ్రహాంకు ఎమ్మెల్యే నివాళి



మండవల్లి : మండవల్లిలోని హెచ్ఏఎఫ్ (హోలీ ఆర్మీ ఫెలోషిప్) వ్యవస్థాపకుడు ముద్రబోయిన అబ్రహాం 18వ జ్ఞాపకార్థ కూడిక జ్ఞాన మందిరం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పూలమాల వేసి అబ్రహంకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తును ప్రార్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, చినతాడినాడ సర్పంచ్ గండికోట ఏసుబాబు, చేబోయిన వీర్రాజు, మెండా సురేష్, డాక్టర్ జాన్ విక్టర్, దైవజనులు, పెద్దలు పాల్గొన్నారు.

నవరత్నాలతో ఇంటింటా సంతోషం

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- ఐనంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



ఐనంపూడిలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు సమస్య వివరిస్తున్న వృద్ధుడు

పమిడిముక్కల: నవరత్నాలతో ఇంటింటా సంతోషం నెలకొందని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న కాలనీల పేరుతో ఊళ్లను నిర్మిస్తున్నామన్నారు. మండలంలోని ఐనంపూడి గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందజేశారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు పేదలకు సక్రమంగా అందుతున్నవో, లేదో ఆరా తీశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హనుమంతరాయపాలెంలో ఇళ్ల స్థలాలు, రోడ్డు, డ్రెయినేజీ సౌకర్యాలు కావాలని కోరగా, ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు.

వృద్ధుడి సమస్య పరిష్కారం..

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గడప గడపకు వెళుతుండగా హనుమంతరాయపాలెంలో కాశిమళ్ల ఆదిశేషు అనే వృద్ధుడు తన సమస్య వినాలని కోరాడు. దీంతో ఎమ్మెల్యే వృద్ధుడి పక్కన కూర్చొని సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. తన కుమారుడికి ఇంటి స్థలం ఇప్పించాలని కోరగా, స్థలం మంజూరు చేయాలని తహసీల్దార్ రాజ్యలక్ష్మికి సూచించారు. దీంతో ఆదిశేషు కుటుంబం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యేనుగ వెంకటరమణకుమారి, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, సర్పంచ్‌లు యేనుగ బేబి, పక్కాల అంజిబాబు, ఎంపీటీసీలు మద్రి దుర్గారావు, గుర్విందపల్లి వంశీ, మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ విఠల్‌పాల్, పార్టీ నాయకులు యేనుగ వెంకటేశ్వరరావు, యేనుగ మస్తాన్‌రావు, బొల్లా సాంబశివరావు, ప్రసాద్, తిరుమలశెట్టి బోసుబాబు, పరుచూరి విజయరాణి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: మెప్మా అధ్వర్యంలో అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను బుధవారం ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఈ స్టాల్స్‌లో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో పలు రకాల వస్తువులు, పిండివంటలు, చేనేత వస్త్రాలు, చెక్కబొమ్మలు, మహిళల అవసరాలకు కావలసిన వస్తువులను అమ్మకానికి ఉంచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, చేయూత, ఆసరా వంటి పథకాల ద్వారా మహిళల ఖాతాల్లోకి నగదు జమచేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల ద్వారా తయారు చేసిన ఉత్పత్తులు ఇక్కడ విక్రయిస్తారన్నారు. వీటి ద్వారా వచ్చే లాభాలను మహిళలు తిరిగి పెట్టుబడి పెట్టి ఆర్థిక పరిపుష్టి సాధించాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా మేనేజర్ శ్రీధర్, టౌన్ లెవల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు మాదాసు వెంకట లక్ష్మీ కుమారి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు పంచకర్ల వెంకట్, గూడపాటి ఇస్సాకు, యార్లగడ్డ మురళి, మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి



కూచిపూడిలో వాజ్‌పేయి చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కూచిపూడి(మొవ్వ): మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి మొవ్వ మండలం కూచిపూడి-పెదపూడి ప్రధాన కూడలిలో బుధవారం నిర్వహించారు. కూచిపూడి బీజేపీ నాయకులు వాజపేయి దేశానికి చేసిన సేవలను స్మరించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా కృష్ణా జిల్లా అధ్యక్షుడు పోలప అశోక్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దోనేపూడి శివరమయ్య, నాయకులు మదికి కిరణ్ బాబు, పోలన నరసింహారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి ఆదర్శనీయుడని బీజేపీ నాయకులు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం జరిగింది. తొలుత వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో అవినీతికి తావివ్వని నేతగా ఆయన గుర్తింపు పొందారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామినేని వెంకటకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్, నియోజకవర్గ ఇన్‌చార్జి సూరే గాంధి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కైకలూరు : గ్రామ సమస్యల పరిష్కారానికి బయటి వ్యక్తుల ప్రమేయం లేకుండా గ్రామంలోనే పరిష్కారం చూపడం, అక్షరాస్యత పెంచడం వంటి ప్రధాన లక్ష్యాలతో జాన్‌పేట యూత్ అసోషియేషన్ 2020లో ఏర్పడిందని వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వంగలపూడి విజయ్, నూతన అధ్యక్షుడు రాయినూతల సుధీర్ చెప్పారు. నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా రాయినూతన సుధీర్, ఉపాధ్యక్షుడిగా పాలపర్తి రాకేష్, ట్రెజరర్‌గా గురజాల ప్రదీప్, జాయింట్ సెక్రటరీగా మాసిపోగు గౌతం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా కరవళ్ల శామ్యూల్, కూనవరపు రాజశేఖర్, మంతినపల్లి యోహాన్, చింటు బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా 200 మంది పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. నూతనంగా ఎన్నికైన యూత్ అసోసియేషన్ బృందానికి పలువురు అభినందనలు తెలిపారు.

నేడు గద్దర్ సంతాప సభ

గుడివాడ టౌన్: ప్రజాగాయకుడు గద్దర్ సంతాప సభ గురువారం దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ఆర్‌టీడీ సీటీఓ బొకినాల రామారావు తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు. దళిత సంఘాల నాయకులు, గద్దర్ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

360 రకాల పండ్ల మొక్కలు నాటిన రైతు



జమిదింటకుర్రు(పెదపారుపూడి): మండలంలోని జమిదింటకుర్రు గ్రామానికి చెందిన పూర్ణ ప్రసాద్ అనే రైతు తన పొలాల్లో సుమారు 360 రకాల పండ్ల మొక్కలను బుధవారం గుడివాడ రోటరీ క్లబ్ సభ్యులు, గ్రామ సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్‌తో కలిసి నాటారు. ఈ సందర్భంగా గుడివాడ రోటరీ క్లబ్ అధ్యక్షరాలు యలమంచిలి రోజా మాట్లాడుతూ రైతు పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతుగా పండ్లు, శ్రీరంగ మొక్కలు వంటివి సుమారు 360 మొక్కలు పెంచటం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామ సర్పంచ్ శివరామప్రసాద్, రోటరీ సభ్యులు మౌనిక, గుడివాడ వాకర్స్ అధ్యక్షుడు చిన్న నారాయణ రెడ్డి, ఏఎన్ఆర్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ పుణుకొల్లు రాజశేఖర్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



కైకలూరు : కలిదిండి మండలం కొండంగి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లాడిశెట్టి నాగేశ్వరరావు కుమారుడు చినబాబు అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ ఇమ్మానేని లక్ష్మణరావు ఎమ్మెల్యేతో ఉన్నారు.

వీరంకిలాకు-కృష్ణాపురం రోడ్డుకు మహర్దశ



నాడు: వీరంకిలాకు-కృష్ణాపురం రోడ్డు



నేడు: వీరంకిలాకు-కృష్ణాపురం రోడ్డు

- రూ.4 కోట్లతో రోడ్డు అభివృద్ధి
- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కృషితో మోక్షం

పమిడిముక్కల: మండల పరిధిలోని వీరంకిలాకు-కృష్ణాపురం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారికి మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రహదారి అభివృద్ధికి రూ.4 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో రహదారిని అభివృద్ధి చేశారు.

సమస్య ఇదీ..

రోడ్డంతా వీరంకిలాకు నుంచి కృష్ణాపురం వరకు పూర్తిగా గుంతలమయంగా ఉంది. మండల పరిధిలోని 10 గ్రామాల ప్రజలు ఈ రహదారి పైనుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. చెరకు సీజన్‌లో ఉయ్యూరు కేసీపీకి చెరకు రవాణా చేసే ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు ఇతర వాహన చోదకులు అవస్థలు పడ్డారు.

ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో..

గుంతలమయంగా మారిన రహదారి అభివృద్ధికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేయించారు. శ్రీలక్ష్మి కన్‌స్ట్రక్షన్ సంస్థ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. మధ్యలో కొంత కాలం రోడ్డు పనులు ఆగిపోవడంతో ఎమ్మెల్యే సమస్యను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కే రోజా, ఆర్ అండ్‌బీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ఇబ్బందులు తొలగాయి.

రహదారుల అభివృద్ధికి చర్యలు..



ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకొంటున్నాం. గోపువానిపాలెం నుంచి మద్రివాడ వెళ్లు రోడ్డు, హనుమంతపురం మీదగా కనుమూరు రోడ్డు, మంటాడ నుంచి వీరంకిలాకు వరకు, ప్రస్తుతం వీరంకిలాకు నుంచి కృష్ణాపురం రోడ్లను అభివృద్ధి చేశాం. కూచిపూడి-ఐలూరు, అగినపర్రు రోడ్లను కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నాం.

–పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

చెప్పిన వెంటనే ఎమ్మెల్యే స్పందించారు



గత ప్రభుత్వంలో కృష్ణాపురం అంటే చిన్నచూపు. రహదారి సమస్య, గౌడపాలెం రోడ్డు సమస్య ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమారకు మా సమస్య చెప్పగానే స్పందించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రధాన రోడ్డు, గౌడపాలెం రోడ్లకు నిధులు మంజూరు చేయించారు. గత పాలకులు ఈ పనులు చేయిస్తామని ఓట్లు వేయించుకొని తర్వాత పట్టించుకోలేదు.

–యార్లగడ్డ శివ, కృష్ణాపురం

గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం



మండవల్లిలో గౌతులచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కైకలూరు : బడుగు బలహీన వర్గాలకు సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కైకలూరులో లచ్చన్న వర్ధంతి సందర్భంగా బుధవారం జయమంగళ మాట్లాడుతూ జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం లచ్చన్న అనుభవించారన్నారు. మంత్రిగా అనేక మందికి సేవలు అందించారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

తోట్లవల్లూరు: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న సేవలు, పోరాటాలను మరువలేమని బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు, రొయ్యూరు సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్ అన్నారు. మండలంలోని రొయ్యూరులో దివంగత మాజీ మంత్రి, బలహీనవర్గాల నాయకుడు గౌతు లచ్చన్న జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు స్మరించుకోవటంతో పాటు లచ్చన్న ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. మోర్ల కోటేశ్వరరావు, ఆరేపల్లి శ్రీనివాసరావు, జంపన వెంకన్న, పల్లపోతు కృష్ణ, మోర్ల శివశంకర్, లుక్కా శివశంకర్, రాము, నాగరాజు, కిషోర్ పాల్గొన్నారు.

మండవల్లి : మండవల్లిలో సర్దార్ గౌతులచ్చన్న వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గౌతులచ్చన్న పేదలకు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన బాటలో యువత పయనించి పేదలకు అండగా నిలవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్రోద్యమ పోరాటంలో, అనంతరం దేశాభివృద్ధికి ఆయన చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. మారగాని రజనిబాబు (పెదబాబు), మరీదు రాధా, ముళ్లపూడి సత్తిబాబు, మురళీకృష్ణ, నారగాని కొండ, చేబోయిన వెంకన్న పాల్గొన్నారు.

భూమి అప్పగించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

మండవల్లి: తమ భూమి తమకు అప్పగించి న్యాయం చేయాలని సింగనపూడి గ్రామానికి చెందిన దళితులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సింగనపూడికి చెందిన 20 దళిత కుటుంబాలకు 15.59 ఎకరాల భూమిని ప్రభుత్వం గతంలో ఇచ్చిందన్నారు. 1925 నుంచి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో దళితులు సాగు చేసుకుంటున్నారన్నారు. 1992వ సంవత్సరంలో చేపలు సాగు చేసుకోవడానికి కైకలూరుకు చెందిన వ్యక్తికి లీజుకు ఇచ్చినట్లు తెలిపారు. కొంతకాలమే లీజు చెల్లించి తర్వాత ఆ భూమిలోనికి దళితులను రానివ్వలేదన్నారు. ఇటీవల ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నడుస్తుందని, తుది తీర్పు ఇచ్చేవరకు ఇరు పక్షాలు వెళ్లకుండా ఆదేశాలు ఇచ్చారన్నారు. దళితుల భూమి వారికే ఇప్పించాలని, న్యాయం చేయకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సభ్యులు పి.దావీదు, బి.చింతయ్య, వీ సుధీర్‌కుమార్, ఎం.ఆదాం తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని అవార్డులు సాధించాలి



పామర్రులో ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్



ప్రశంసా పత్రాలతో ఎంపీడీఓ స్వర్ణలత, ఏఓ ఉషారాణి

పామర్రు: విధి నిర్వహణకు ఉత్తమ ప్రతిభ చూపిన ఇరువురు సచివాలయ ఉద్యోగులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని నిమ్మకూరు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ నందం వెంకటేశ్వరరావు, పామర్రు-1 సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పంచగాని సృజన్ ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు పొందారు. మచిలీపట్నంలో మంత్రి రోజా, జిల్లా కలెక్టర్ నుంచి అవార్డులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇరువురినీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ మరింత మెరుగైన సేవలను అందించి, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని కోరారు. వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీ భోగిన వెంకటేశ్వరమ్మ, కార్యాలయ సూపరింటెండెంట్ ప్రమీల, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జేసీ అపరాజితాసింగ్ నుంచి ఉత్తమ అధికారులుగా ప్రశంసాపత్రాలు అందుకున్న ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, మండల పరిషత్ కార్యాలయ ఏఓ ఉషారాణి, తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రమణను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అభినందించిన వారిలో ఉన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ సంఘటితం కావాలి

పామర్రు: బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ గోపాలరావు అన్నారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ సభ్యులు, అఖిలపక్ష నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం బోర్డుకు అప్పగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్మికుల కుమార్తెల వివాహాలకు, ప్రసవాలకు గతంలో ఇచ్చే విధంగా పథకాలను అమలు చేయాలని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 21 స్థానిక శాసన సభ్యులకు, వచ్చే నెల 1వ తేదీన జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు. సీఐటీయూ నాయకులు గంగాధర ప్రసాద్, ఆలీఖాన్, కె.నాగభూషణం, ఐ.రాజు, అల్లాభక్షు, అలీ, పలు పార్టీ నాయకులు సీహెచ్ సుబ్బారావు, ఎం. రామాంజనేయులు, గంగాధరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వరిలో పురుగులు, తెగుళ్ల నివారణకు చర్యలు

మండవల్లి : మండలంలోని అల్లినగరం గ్రామంలో పురుగులు, తెగుళ్లపై నిఘా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ వరి పంట పిలకలు తొడిగే దశలో జీవామృతం, నీమాస్త్రం పిచికారీ చేసి చీడపీడల నుంచి నివారణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రజుమంలో నాగవిజయ ఐసీ ఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.